వైద్యులకు సేవాభావం అవసరం

ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో మంత్రి సత్యకుమార్

ధర్మవరం, న్యూస్‌టుడే: వైద్యవృత్తి పవిత్రమైనదని, వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావం కలిగి ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ధర్మవరంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వర్కింగ్ కమిటీ సమావేశం స్థానిక విష్ణు ప్రియ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. వైద్యుల సమస్యలను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్ర నాయుడు, జనరల్ సెక్రెటరీ ఫణిధర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు 175 నియోజకవర్గాల్లోనూ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు 100 పడకలతో నిర్మాణం చేపట్టేందుకు సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఆసుపత్రుల నిర్మాణం చేపట్టి మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తామన్నారు. కొందరు వైద్యులు అవసరం లేని మందులు, పరీక్షలు చేయిస్తున్నారని, దీనివల్ల ఆసుపత్రులకు వచ్చేవారికి ఆర్థికభారం పడుతోందన్నారు. వైద్యులపై దాడుల నివారణకు కొత్త ఆర్డినెన్స్ తీసుకువస్తామని చెప్పారు. అనంతరం ఐఎంఏ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయచంద్రనాయుడు, డాక్టర్ ఫణిధర్, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ నందకిషోర్, డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ జయకుమార్, డాక్టర్ వాసుదేవరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

మాట్లాడుతున్న సినీనటుడు సుమన్

వెంకన్న లడ్డూ విషయంలో పెద్దతప్పు చేశారు

గుంతకల్లు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూను కల్తీచేసి కొందరు తీవ్ర వాదుల కన్నా పెద్దతప్పుచేశారని చలనచిత్ర నటుడు సుమన్ అన్నారు. గుంతకల్లులో ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై విలేకరులతో మాట్లాడారు. సినిమాలో వేంకటేశ్వరస్వామి పాత్రను ధరించిన తనకు వెంకన్న అంటే విపరీతమైన భక్తి అని అన్నారు. హిందువులంతా తిరుమల లడ్డూను ఎంతో భక్తితో స్వీకరిస్తారు. అలాంటి పవిత్రమైన ప్రసాదాన్ని కొందరు కల్తీచేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. పాలకమండలి, అధికారులు ఏమిచేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. నెయ్యి ట్యాంకర్లతో వచ్చినపుడు దాన్ని తనిఖీచేసి తీసుకోవాల్సిన బాధ్యతను అందరూ విస్మరించారన్నారు. ఇందులో ఎవరి పాత్ర ఉన్నా ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తిరుమలలోనే కాకుండా ఇతర మతాల విషయంలోనూ ఇలా చేస్తే కఠినంగా శిక్షలు వేయడానికి ప్రభుత్వం పార్లమెంటులో బిల్లును తీసుకురావాలన్నారు.

గుంతకల్లు గ్రామీణం: కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామిని సినీ నటుడు సుమన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణలు అనంతరం ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారి పేరిట ప్రత్యేక అర్చనలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఆయన వెంట తెదేపా నాయకుడు అనిల్ కుమార్ గౌడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు



వుట్టపర్తి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, లబ్ధిదారులు అసౌకర్యాల నడుమ కాలం గడిపారు. అంగన్‌వాడీ చిన్నారులు, సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రక్షిత తాగునీరు అందుబాటులో ఉండేది కాదు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయిదేళ్లలో సౌకర్యాలు కల్పించాలన్న విషయాన్ని ఆ ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుత పరిస్థితులు మారుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి రోజులు రానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలన్నిటిలో సొంత భవనాలుండి కనీస వసతులు అవసరమైనచోట కల్పించనున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు సంబంధించిన పనుల నిర్వహణ బాధ్యతలు జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగానికి అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, ఒక్కో ఆర్వో ప్లాంటుకు రూ.17 వేల చొప్పున వ్యయం చేయనున్నారు.

పక్కా భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. **- నాగమల్లేశ్వరి, జిల్లా ఐసీడీఎస్ పీడీ**

మౌలిక సదుపాయాలకు రూ.3.38 కోట్లు

శ్రీసత్యసాయి జిల్లాలో సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 2,826 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో మరుగుదొడ్లు లేని 615 కేంద్రాల్లో ఏర్పాటుకు రూ.2.21 కోట్లు, 692 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.1.17 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వాటి పర్యవేక్షణ బాధ్యతలను ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగించారు. వీలైనంత వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాలోని 10, శ్రీసత్యసాయి జిల్లాలోని 8 స్టేషన్లకు నియమించారు. అనంతపురం నగర స్టేషన్‌కు సత్యనారాయణ, బుక్కరాయసముద్రానికి నాగసునీత రాణి, గుత్తికి ఉమాదేవి, గుంతకల్లుకు శివసాగర్, తాడిపత్రికి నాయుడు, ఉరవకొండకు రవిచంద్ర , కణేకల్లుకు ఉమాబాయి, రాయదుర్గానికి గణేశ్, కళ్యాణదుర్గానికి హసీనా భాను, కంబదూరుకి రఫీ.. శ్రీసత్యసాయి జిల్లాలో ధర్మవరానికి చంద్రమణి, చెన్నేకొత్తపల్లికి ఫరూక్ ఆజం, పెనుకొండకు సృజన్‌బాబు, పుట్టపర్తికి నాగరాజు, హిందూపురానికి లక్ష్మీదుర్గయ్య, కదిరికి వీరారెడ్డి, తనకల్లుకు వెంకటలక్ష్మమ్మ, మడకశిరకు ప్రసాద్‌ను నియమించారు.

దసరా ఉత్సవాలు విజయవంతం చేద్దాం

లేపాక్షి, న్యూస్‌టుడే: అక్టోబరు 3వ తేదీ నుంచి నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ పిలుపునిచ్చారు. స్థానిక దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఆలయం లోపల, వెలుపల, రహదారుల్లో విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్చకులు శ్రీనివాసరావు, లక్ష్మీనరసింహశర్మ, సిబ్బంది మల్లికార్జున, రాము పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్

జలమయమైన ధర్మవరం

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో ఆదివారం భారీ వర్షం పడింది. గంటన్నర పాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు, వీధులు జలమయం అయ్యాయి. ఎన్టీఆర్ కూడలి నుంచి గాంధీనగర్ వరకు ప్రధాన రహదారిపై నీరు ప్రవహించాయి. వాహనదారులు ఇక్కట్లు పడుతూ వెళ్లారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి వర్షం నీరు పీఆర్‌టీ కాలనీ మీదుగా ప్రవహించింది. దాంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఎన్టీఆర్ కూడలిలో నీరు నిలిచింది. గ్రంథాలయం పక్కన ప్రధాన రహదారిపై వర్షం నీరు ప్రవహిస్తుండటంతో అరగంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. మాధవనగర్, సంజయ్‌నగర్ ప్రాంతాల్లోనూ ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి.

గాంధీనగర్ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షం నీరు

23 మండలాల్లో వర్షం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం 5 నుంచి కుండపోత వర్షం కురిసింది. 23 మండలాల్లో మోస్తరు నుంచి జల్లుల వర్షం కురిసింది. అత్యధికంగా పుట్టపర్తిలో 64.6 మి.మీ., అత్యల్పంగా బత్తలపల్లిలో 1.4 మి.మీ. వర్షం కురిసింది. హిందూపురం 40.2, పెనుకొండ 39.6, తనకల్లు 34.2, సోమందేపల్లి 32.6, బుక్కపట్నం 29.6, నల్లచెరువు 28.8, చిలమత్తూరు 26.2, కొత్తచెరువు 24.2, అమడగూరు 19.6, రొద్దం 19.4, గోరంట్ల 18.2, పరిగి 15.6, ధర్మవరం 13.6, లేపాక్షి 10.2, అగళి 8.4, కదిరి 8.2, మడకశిర 6.0, గుడిబండ 5.2, ఓడీసీ 5.2, రొళ్ల 4.6, నల్లమాడ 2.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

చిన్నారిని కాపాడిన వైద్యుడు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: హిందూపురంలోని ఆర్టీసీ కాలనికి చెందిన రిజ్వాన్ ఉపాధి కోసం ఒమన్ దేశానికి వెళ్లాడు. భార్య ఆయేషా, కుమార్తె ఫాతిమా (6) మస్కట్ పట్టణంలో నివాసముంటున్నారు. ఈనెల 21న చిన్నారి కిందపడటంతో తల్లిదండ్రులు అక్కడి ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చిన్నారిని పరీక్షించి మెదడులో నరాలు చిట్లిపోయాయి, అయినా మేము గ్యారెంటీ ఇవ్వలేమన్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యుడు శివకుమార్‌ను చరవాణిలో సంప్రదించి రిపోర్టులను వాట్సప్‌లో పంపారు. పరిశీలించిన వైద్యుడు చిన్నారి ఆరోగ్యంగా ఉందని రక్తం 4.5 గ్రాములు ఉండటంతో అనిమీయా (రక్తహీనత) తో ఇబ్బంది పడుతూ అనారోగ్యానికి గురైయిందని చెప్పారు. వెంటనే హిందూపురం చేరుకుని, ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. 'ఏ' పాజిటీవ్ రక్తం అందించటంతో ఒక్క రోజులోనే చిన్నారి కోలుకుంది. వైద్యుడు శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

కలుషిత నీటితో పాలాలు విషతుల్యం

ఆందోళనలో రైతన్నలు

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: ఓ వస్త్ర పరిశ్రమ నుంచి వచ్చే కలుషిత నీరు రైతులు, మూగజీవాల పాలిట శాపంగా మారింది. కలుషిత నీరు భూమిలోకి ఇంకిపోవడంతో భూగర్భ జలాలు విషతుల్యం అవుతున్నాయి. రైతులు సాగు చేస్తున్న పంటలు పండని పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని కాలువపల్లికి చెందిన ఓ ప్రైవేటు వస్త్ర పరిశ్రమ నుంచి విడుదల అవుతున్న వివిధ రంగులతో కూడిన వ్యర్థపు నీటితో తమ పొలాలు విషతుల్యం అవుతున్నాయని బోరెడ్డిపల్లికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వస్త్ర పరిశ్రమకు చెందిన యాజమాన్యం దుస్తులకు రంగులు అద్దిన తరువాత వచ్చే వృథా నీటిని రెండు కిలోమీటర్ల మేర జయమంగళి నది అంతర్భాగంలో పైప్‌లైన్ ఏర్పాటు చేసి బోరెడ్డిపల్లి గ్రామ సమీపంలో వస్త్ర పరిశ్రమకు చెందిన వ్యవసాయ పొలంలోకి వ్యర్థాల నీటిని వదులుతున్నారు. తరుచూ పైప్‌లైన్ లీకేజీ కారణంగా వ్యర్థాలతో కూడిన నీరు జయమంగళి నదిలోకి ఇంకిపోతోంది. దీంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. ఆ విషతుల్యమైన నీటిని తాగి పశువులు, మేకలు, గొర్రెలు రోగాలబారిన పడుతున్నాయి. దీంతో పాటు సమీపంలో ఉన్న వ్యవసాయ బోర్లలోకి విషతుల్యమైన నీరు ఇంకిపోవటం వల్ల వ్యవసాయ బోర్లనుంచి వచ్చే నీరు ఉప్పునీరుగా మారి రైతులు సాగు చేసిన పంటల నుంచి దిగుబడి గణనీయంగా పడిపోయింది.

పైప్‌లైన్ లీకేజీ కారణంగా జయమంగళి నదిలో విషతుల్యమైన నీరు

ఒకప్పుడు వ్యవసాయానికి పేరు..

మండలంలోని బోరెడ్డిపల్లి ఒకానొకప్పుడు వ్యవసాయానికి పెట్టింది పేరు.. గతంలో ఈ గ్రామంలో రైతులు చెరకుతో పాటు వివిధ రకాల పంటలు సాగుచేసేవారు. బోరెడ్డిపల్లిలో సాగు భూమి 130 ఎకరాల పైబడి ఉంది. 30కి పైగా వ్యవసాయ బోర్లు, గొర్రెలు, మేకలు 700, ఆవులు, గేదెలు 150 ఉన్నాయి. రైతులు పాడి పంటల సాగు ద్వారా జీవనం సాగిస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి వృథా నీటిని విడుదల చేయకుండా పరిశ్రమ వద్దే సంప్‌ను నిర్మించి నిల్వ చేసేలా అధికారులు పరిశ్రమ యాజమాన్యానికి తగు ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు. లేని పక్షంలో పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

- హనుమంతు, బోరెడ్డిపల్లి రైతు

వ్యవసాయ పొలాల చుట్టూ పేరుకుపోయి ఉన్న విషతుల్యమైన నీటి నుంచి వచ్చే కంపు భరించలేకపోతున్నాం. గతంలో జయమంగళి నది పక్కన ఉన్న బోర్ల నుంచి స్వచ్ఛమైన మంచి నీరు లభించేది. ప్రస్తుతం మా వ్యవసాయ బోర్ల నుంచి వచ్చేవి ఉప్పునీరుగా మారిపోతోంది. పంట దిగుబడిపై ప్రభావం చూపుతోంది. రాబోవు రోజుల్లో ప్రజలు తాగేందుకు నీరు పనికిరాకుండాపోతుంది. అధికారులు స్పందించాలి.

తగు చర్యలు తీసుకుంటాం

- హసీనాసుల్తానా, తహసీల్దార్, పరిగి

పరిశ్రమ నిర్వాహకులకు పిలిపించి వ్యర్థాల నీటిని జయమంగళి నది, పొలాల్లోకి వెళ్లనీయ కుండా తగు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.

ఏచూరి ఆశయాలు కొనసాగిద్దాం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: సీపీఎం నాయకుడు దివంగత సీతారాం ఏచూరి దిక్సూచిలా పనిచేశారని కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. పట్టణంలోని సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. గొప్ప లౌకిక విలువలు కలిగిన మహాయోధుడిని కోల్పోయామన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏచూరి ఆశయ సాధనకు కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేటీ శ్రీధర్, రైతు సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్.రఘువీరారెడ్డి, వేదికపై నాయకులు

'సమన్వయంతో పని చేస్తున్నాం'

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలసికట్టుగా పని చేస్తున్నామని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పరిటాల శ్రీరామ్, అనంతపురం జిల్లా భాజపా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పురపాలక కమిషనర్‌గా పని చేసిన మల్లికార్జున తీరుతో కూటమి పార్టీల కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారన్నారు. అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డికి అనుకూలంగా కమిషనర్ పని చేశారని, ఆ విషయాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని, సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. ధర్మవరం నియోజకవర్గాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందన్నారు. సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, మధుసూదన్‌రెడ్డికి, పరిటాల శ్రీరామ్‌కు మధ్య పూర్తి సమన్వయం ఉందన్నారు. సమావేశంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్ పక్కన మధుసూదన్‌రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి

మారుతున్నాయ్..

- సీసీ రోడ్ల ఊసే మరిచిన వైకాపా పాలన
- 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వ కార్యాచరణ
- పనులకు ఎమ్మెల్యే సునీత శ్రీకారం

సీసీ రోడ్డు నిర్మాణ ప్రదేశంలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: వీధిదారులు బాగు చేద్దామన్న ఆలోచన ఐదేళ్ల వైకాపా పాలనలో ఏనాడూ చేయలేదు. పంచాయతీల నిర్వహణ, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్ని సైతం పక్కదారి పట్టించిన పరిస్థితి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక పలు అభివృద్ధి పనులకు కదలిక వచ్చింది. ఆగమేఘాలపై అనుమతులు వచ్చాయి. వచ్చే ఫిబ్రవరికల్లా పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళికతో శ్రీకారం చుట్టడం ఆహ్వానించదగిన పరిణామం.

సీసీ రోడ్ల నిర్మాణం ఏ ప్రాంతాల్లో..

రూ.2.50 కోట్లు: రాప్తాడు మండలం పుల్లలరేవు, చెర్లోపల్లి, హంపాపురం, యర్రగుంట, రాప్తాడు, ప్రసన్నాయపల్లి, గొందిరెడ్డిపల్లి, బండమీదపల్లి గ్రామాల్లో రోడ్లు..

రూ.3.6 కోట్లు: సీకేపల్లి మండలం ప్యాదిండి, నాగసముద్రం, నామాల, బసంపల్లి, నరసింగరాయునిపల్లి, ఓబుళంపల్లి, ఎన్ఎస్‌గేట్, సీకేపల్లి, హర్యాన్‌చెరువు గ్రామాల్లో రోడ్లు

వీధిదారుల రూపురేఖలు

రూ.4.60 కోట్లు: కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల, బాలేపాళ్యం, కనగానపల్లి, తగరకుంట, తూముచెర్ల, మామిళ్లపల్లి, ముక్తాపురం, దాదులూరు, వేపకుంట, మద్దెలచెరువు గ్రామాల్లో అభివృద్ధి పనులు

రూ.2.87 కోట్లు: ఆత్మకూరు మండలం ముట్టాల, గొరిదిండ్ల, పి.యాలేరు, సనప, బి.యాలేరు, పంపనూరు, సిద్ధరాంపురం గ్రామాల్లో సీసీరోడ్లు

రూ.3 కోట్లు: రామగిరి మండలం కుంటిమద్ది, నననకోట, గంగంపల్లి, మదాపురం, కొత్తగాదిక్కుంట, ఆర్ కొత్తపల్లి, దుబ్బార్లపల్లి, తిమ్మాపురం, మంగాపురం, గరిమేకలపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు.

సీకేపల్లిలో అధ్వానస్థితిలో ఉన్న సీసీ రోడ్డు నిర్మించేందుకు అధికారులతో కలిసి పరిశీలిస్తున్న తెదేపా సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి

చినుకుపడితే బురదే

చిన్నపాటి చినుకుపడినా కుంటిమద్ది గ్రామంలోని వీధులన్నీ బురదమయంగా మారతాయి. రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ దారులను సీసీదారులుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయం. గ్రామంలోని పలు వీధిదారుల బాగుకు రూ.31 లక్షలు మంజూరయ్యాయని అధికారులు చెప్పడం సంతోషంగా ఉంది.
- తిరుపాల్, శ్రీహరిపురం, రామగిరి మండలం

నాణ్యతగా పనులు చేపడతాం

నియోజకవర్గంలో అన్ని మండలాల్లో సీసీ దారుల నిర్మాణ పనులు ప్రారంభించాం. నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని మండల పంచాయతీరాజ్ ఇంజినీర్లకు ఆదేశాలిచ్చాం. వచ్చే ఏడాది జనవరిలోగా పూర్తి చేస్తాం.
- లక్ష్మీనారాయణ, డీఈ, పంచాయతీ రాజ్

అస్తవ్యస్తం గత ప్రభుత్వ హయంలో అభివృద్ధి పనులను ప్రాధాన్యం ఇవ్వడమే మరిచారు. ఐదేళ్ల వైకాపా పాలనలో సీకేపల్లి మండలంలో రూ.30 లక్షలతో 610 మీటర్లు, రాప్తాడులో రూ. కోటితో 2 వేల మీటర్లు, ఆత్మకూరు మండలంలో రూ. 85 లక్షలతో 1.7 కి.మీ మేర సీసీ దారులు నిర్మించినట్లు లెక్కల్లో చూపారు. ఆర్బీకేలు, గ్రామ సచివాలయ, వీలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు పునాది, గోడల స్థాయిలోనే నిలిచిపోయాయి.

ధర్మవరం కమిషనర్ నియామకంపై పునరాలోచన: మంత్రి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ధర్మవరం కమిషనర్ మల్లికార్జున వివాదంపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పందించారు. కమిషనర్ మల్లికార్జునను ప్రభుత్వం నియమించింది.. గతంలోనూ పనిచేయడంతో ఆయన వ్యవహార శైలిపై ఆరోపణలు వచ్చాయి. ఆ విషయాన్ని తెదేపా, జనసేన నేతలు పరిటాల శ్రీరామ్, మధుసూదన్‌రెడ్డిలు నా దృష్టికి తీసుకురావడంతో పునరాలోచిస్తామని చెప్పాం. గతంలో కమిషనర్ పనితీరు గురించి నాకు తెలియదు.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పాం. స్వచ్ఛ ధర్మవరంగా మారుస్తామని మాటిచ్చాం.. ఆ దిశగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం' అని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. ధర్మవరం నుంచి పులివెందుల మీదుగా ప్రొద్దుటూరు వచ్చానని రహదారులు అధ్వానంగా కనిపించాయని చెప్పారు. ఐదేళ్ల పాటు జగన్ అరాచకపాలన నడిపారని ఆరోపించారు.

(c) eenadu

సేవా పన్ను వసూలైతే.. ప్రగతికి బాటలు

✦ పురపాలికలకు రూ.13 కోట్ల బకాయిలు

✦ పట్టించుకోని రైల్వే శాఖ

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రైల్వే అధికారులు పురపాలకానికి కొన్నేళ్లుగా సేవా పన్ను బకాయిలు చెల్లించడం లేదు. అధికారులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇప్పుడు.. అప్పుడు అంటూ కాలం గడుపుతున్నారు. గుంతకల్లు రైల్వే అధికారులు పురపాలకానికి రూ.7 కోట్ల వరకు బకాయిలను చెల్లించాల్సి ఉంది. ప్రధానంగా రైల్వేస్టేషన్లు ఉన్న అనంతపురం, గుత్తి, తాడిపత్రి, ధర్మవరం, కదిరి తదితర పురపాలకాలకూ రూ.5 కోట్లకు పైన సేవా పన్ను రైల్వే నుంచి అందాల్సి ఉంది.

ఎందుకు చెల్లించాలంటే..?

రైల్వేలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులు పురపాలకానికి చెందిన రోడ్లు, మార్కెట్లు, దుకాణాలు, పెట్రోలు బంకులు, రెవెన్యూ, పురపాలక కార్యాలయాల సేవలను వినియోగించుకుంటుంటారు. ఈక్రమంలో పురపాలకానికి పన్నును చెల్లించాలని ఉన్నత న్యాయస్థానాలు

పన్ను బకాయిపడిన డీఆర్‌ఎం కార్యాలయం

2009 సంవత్సరంలో తీర్పు ఇచ్చాయి. రైల్వే భవనాలు, స్థలాలను బాడుగలకు ఇస్తే ఎంత మొత్తం చెల్లించాల్సి వస్తుందో అంత మొత్తంలో 33 శాతం వరకు పన్ను కింద చెల్లించాలని న్యాయస్థానాలు తీర్పు ఇచ్చాయి. దీనికి గాను రాష్ట్ర పురపాలక ఉన్నతాధికారులు ఉత్తర్వు సంఖ్య: 170-టి.సి1-2010-1ను జారీ చేశాయి. దీన్ని అమలు చేయడానికి పురపాలక అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

ఒత్తిడి తెస్తున్నాం: - వాసిర్, పురపాలక రెవెన్యూ అధికారి, గుంతకల్లు

సేవా పన్ను కింద రైల్వే నుంచి రూ.7 కోట్లు రావాలి. 14 ఏళ్లుగా చెల్లించడం లేదు. దీనిగురించి ప్రతి డీఆర్‌ఎం వద్ద చర్చకు తీసుకొస్తున్నాం. డిమాండ్ నోటీసులు ఇస్తుంటే వారు చూస్తాం, ఇస్తాం అంటూ కాలం గడుపుతున్నారు. పన్ను వసూలు అయితే ప్రగతి పనులకు ఆస్కారం ఉంటుంది. దీనిపై మరింత ఒత్తిడి తీసుకొస్తాం.

అభివృద్ధికి వెనులు బాటు

సేవా పన్ను బకాయిలు వసూలైతే పట్టణాల్లో ప్రజలకే కాకుండా రైల్వే వినియోగదారులకూ మంచి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం పురపాలికలు నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు అధికారులు అనుకున్న మేరకు చేయలేక పోతున్నారు. సరైన రోడ్లు, మురుగు కాలువలు, మార్కెట్ సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా వచ్చిన తెదేపా ప్రభుత్వం పన్నుల వసూలుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పాలకుల్లో మార్పు వస్తేనే సమ సమాజం

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అధికార మార్పిడి జరిగినంత మాత్రాన సమ సమాజం స్థాపన సాధ్యం కాదని, పాలక వర్గం ఆలోచనా స్వరూపంలోనే మార్పు రావాల్సి ఉందని కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ వీకే. రామచంద్రన్ పేర్కొన్నారు. లెనిన్ వర్ధంతి సందర్భంగా అనంతపురం నగరంలో సీపీఎం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'రాజ్యం, విప్లవం' అనే అంశంపై సదస్సు జరిగింది. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్రన్ మాట్లాడుతూ.. నేటి పెట్టుబడిదారీ వ్యవస్థలో పేద, ధనికుల మధ్య

ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ వీకే రామచంద్రన్

అంతరాలు అనివార్యమని మార్క్సు, లెనిన్‌లు ఇద్దరూ ఆనాడే తమ రచనల ద్వారా తెలియజేసారని గుర్తుచేశారు. సమాజంలో పాలకవర్గాలన్నీ కూడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకే పనిచేస్తాయని చెప్పారు. ప్రతి నలుగురు చిన్నారుల్లో ముగ్గురికి సరైన పౌష్టికాహారం లభించడం లేదన్నారు. కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, రాష్ట్ర నాయకులు ఓబులు, నాయకులు భానుకిరణ్, బాషా, గోవిందరాజులు, సత్యబోస్, రాజ్‌మోహన్, రమణయ్య, సతీష్, రంగనాయకులు, సత్యనారాయణరెడ్డి, సావిత్రి పాల్గొన్నారు.

టమాటా ధర పెరుగుదల

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌లో పది రోజులుగా టమాటా ధరలు నిలకడగా ఉన్నాయి. ధరలు బాగుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ఐదు రోజులుగా విక్రయాలు బాగా తగ్గాయి. విక్రయాలు తగ్గడంతోనే ధరలు తగ్గకుండా ఉన్నాయని వ్యాపారవర్గాలు తెలిపాయి. ఆదివారం మార్కెట్‌కు 2 వేల నుంచి 3 వేలు పైచిలుక టన్నులు మార్కెట్‌కు వచ్చేవి. ఐదు రోజులుగా 1600-1,300 టన్నులు వచ్చాయి. ఆదివారం 1,350 టన్నులు వచ్చాయి. కిలో టమాటా గరిష్ఠ ధర రూ.47 ఉండగా మధ్యస్థ ధర రూ.38, కనిష్ఠ ధర రూ.30 వరకు ధరలు పలికాయి. మార్కెట్‌కు 15 కిలోల బుట్టెలు వస్తున్నాయి. ఒక్కో బుట్టె ధర గరిష్ఠంగా రూ.705, మధ్యస్థం రూ.570, కనిష్ఠం రూ.450 చొప్పున ధర చొప్పున పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.

అండర్-19 చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల అండర్-19 చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. కొత్తపూరు జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలకు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలు వచ్చే నెల మూడో వారంలో నిర్వహించనున్నారు. జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య జిల్లా కార్యదర్శి జి. లక్ష్మీనారాయణ, చెస్ శిక్షకుడు హుస్సేన్‌ల పర్యవేక్షణలో క్రీడాకారులను ఎంపిక చేశారు.

ఎంపికైన క్రీడాకారులతో శిక్షకులు

ఎంపికైన క్రీడాకారుల వివరాలు..

బాలురు: అదిత్యారెడ్డి, హన్ని స్వీపెన్, విశ్వనాథ్, మిస్ఫా, తరుణ్ **బాలికలు:** అనన్య, భువనకృతి, క్లారా, అభిజ్ఞ, సాహామారీన్

శ్రీరామరెడ్డి కార్మికుల మెరుపు సమ్మె

రాయదుర్గం, న్యూస్‌టుడే: డిమాండ్లు తీర్చాలని కోరుతూ రాయదుర్గం నియోజకవర్గంలోని శ్రీరామరెడ్డి కార్మికులు ఆదివారం ఉదయం 11 గంటలకు విద్యుత్తు మోటార్లు నిలిపివేసి మెరుపు సమ్మెలోకి వెళ్లారు. దీంతో నియోజకవర్గంలోని వందకుపైగా గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన లైన్‌మెన్‌లు, ఆపరేటర్లు, ఫిట్టర్లు, వాచ్‌మెన్‌లు మొత్తం 58 మంది మెరుపు సమ్మె చేశారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సంఘం జిల్లా సెక్రటరీ రాము, మండలాధ్యక్షులు అశోక్, సంజీవప్పల ఆధ్వర్యంలో ఈ సమ్మె జరిగింది. నియోజకవర్గంలోని ఆలూరు, టి.వీరాపురం, రాయదుర్గం పట్టణంలోని విద్యుత్తు మోటార్లను బంద్ చేసి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. గతంలో తాము సమ్మె చేసినప్పుడు ఈనెల 23వ తేదీలోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్ 29వ తేదీ దాటినా పట్టించుకోకపోవటంతో మెరుపు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు ఎనిమిది నెలల జీతాలు, ఏళ్ళ తరబడి అందాల్సిన పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

ఆలూరు నీటి పథకం వద్ద ఆందోళన చేస్తున్న శ్రీరామరెడ్డి కార్మికులు

సంతల జోరు.. ఆదాయం బాగు

అనంత మార్కెట్‌యార్డు, న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతలు జోరుగా కొనసాగుతున్నాయి. వారం వారం ఆదాయం పెరుగుతోంది. గత నెలలో వారం సంతలో రూ.4 లక్షలు దాటలేదు. ఈ నెలలో రూ.5 లక్షల ఆదాయం దాటింది. సంతలే యార్డుకు ఆదాయ వనరుగా మారాయి. ఈ నెలలో పశువులు, గొర్రెలు, వ్యాపారులు, రైతులు, కాపర్లతో సంతల్లో కిక్కిరిసింది. మూడు వారాలు సంతలు పరిశీలిస్తే.. ఈ నెల 16న రూ.4,30,075, ఈనెల 23న రూ.4,49,300 పెరుగుతూ వచ్చింది. ఈ వారం ఏకంగా రూ.6 లక్షలకు చేరువైంది. ఈ వారం సంతల్లో రూ.5,91,480 ఆదాయం వచ్చింది. అందులో శనివారం గొర్రెలు, మేకలు సంతలో రూ.3,42,370 ఆదాయం రాగా, పశువుల సంతలో రూ.2,49,110 ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. గతంలోని సంతల్లో ఇంత భారీగా ఆదాయం ఎప్పుడూ రాలేదని యార్డు అధికార వర్గాలు పేర్కొనడం గమనార్హం.

3 నుంచి కొడిమిలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 3 నుంచి బాలబాలికలకు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. కొడిమి జర్నలిస్టుల కాలనీలో ఏర్పాటు చేసిన నెట్స్‌లో ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల పిల్లలకు శిక్షణ ఇస్తామన్నారు. పదేళ్ల నుంచి 25 ఏళ్లలోపు వారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. క్రికెట్ సామగ్రి ఉచితంగా పిల్లలకు అందజేస్తామన్నారు. సీనియర్ క్రికెటర్లు ఈ శిబిరంలో శిక్షణ ఇస్తారని వివరించారు. ఆసక్తిగల వారు 94900-62555 చరవాణి నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గన్‌మెన్లను వెనక్కి పంపిన అనంత ఎమ్మెల్యే

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రాప్తాడు నియోజవర్గానికి చెందిన వైకాపా నాయకుడు మహానందరెడ్డికి ప్రభుత్వం గన్‌మెన్లను ఇవ్వడంతో, అందుకు నిరసనగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తనకు కేటాయించిన గన్‌మెన్లను వెనక్కి పంపినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే అక్కడి నుంచే గన్‌మెన్లను తిప్పి పంపినట్లు సమాచారం. మహానందరెడ్డి రాప్తాడు నియోజకవర్గంలో గతంలో ముగ్గురి హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఎన్నికలకు ముందు దగ్గుపాటిని ఎమ్మెల్యేగా ప్రకటించే క్రమంలో మహానందరెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించి, దగ్గుపాటికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. ఇదే క్రమంలో సొంత పార్టీ నాయకులతో సైతం విభేదాలు ఉన్నాయి. రాప్తాడులో ప్రధాన నాయకుడిగా చలామణి అవుతున్న తనపై తెదేపా నుంచి తనకు ప్రాణహాని ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాడు. ప్రభుత్వం అతడికి వన్ ప్లస్ వన్ గన్‌మెన్లను కేటాయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్టమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం Call: 7382114647.

EDUCATION

DMLT 2 సం॥ కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. కొన్ని సీట్లు మాత్రమే కలవు. Cl: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) # SEEDS కాలేజ్, ATP. 9440255034.

REAL ESTATE

PLOT FOR SALE

ఆలమూరు రోడ్డు నుండి 3వ బిట్టు, 1.1/2 ఎకరాలలో, 3 మరియు 4 సెంట్లు ప్లాట్లు అమ్మకం. (1,90,000 నుండి 2,90,000 రూపాయలు ఒక సెంటుకు) ఫోన్: 78932 93954, 95502 21809

అనంతపురం NH హైవే దగ్గర, రుద్రంపేట మెయిన్ రోడ్డుకు 30x59 కొలతలు గల వాణిజ్య సముదాయానకు అనువైన రెండు ప్లాట్లు (8 సెంట్లు) అమ్మబడును, No బ్రోకర్స్, Direct Cont No: 8919733343.

JOBS

ప్రముఖ కంపెని యందు మార్కెటింగ్ పనిచేయడానికి Freshers మరియు అనుభవము కలిగిన Sales Person's కావలెను. ATP. PH: 8300925259, 9642831744

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను / పెషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. Cell: 89776 39662, 89776 39663.

Inter CBSE +1 Maths, Phygics, Chemistry Home Tutor కావలెను. లక్ష్మీనగర్, ATP. Cell: 9550579985

ATPలో ప్రముఖ కంపెనీ నందు పనిచేయుటకు 1 Year అనుభవం గల Tally వచ్చిన Senior Accountent కావలెను. సెల్: 9032543196.

ATPలో ప్రముఖ కంపెనీ నందు అనుభవం కలిగిన కన్నడ, హిందీ & ఇంగ్లీష్ వచ్చిన Tele Callers కావలెను, మంచి జీతం: 8125169846.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు నరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అమరావతి, పోలవరమే కాదు సీమకూ నిధులివ్వండి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: అమరావతి, పోలవరం అభివృద్ధి మాత్రమే కాకుండా రాయలసీమ అభివృద్ధికి కేంద్రంతో నిధులు సాధించాలని సీఎం చంద్రబాబునాయుడును రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రాయలసీమ విద్యావంతుల వేదిక నాల్గో రాష్ట్ర మహాసభలు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పురపాలక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని మహిళా స్వశక్తి భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 44 శాతం భూములకు నీటి ప్రాజెక్టులు ఉంటే రాయలసీమలో కేవలం తొమ్మిది శాతం భూములకు మాత్రమే కట్టారన్నారు. సీమ అభివృద్ధికి రాజకీయాలను పక్కన పెట్టి ఇక్కడి ఎమ్మెల్యేలు, ఎంపీలు సీమ ఉద్యమాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. విభజన హామీలు అమలు తీరుపై డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం చట్టబద్ధంగా చేసిన విభజన చట్టంలో సీమకు రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీ సెయిల్ ఆధ్వర్యంలోని ఉక్కు ఫ్యాక్టరీపై మాట్లాడకుండా సీమ పాలకవర్గాలు వారి ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా ఉద్యమం తెరమీదకి తెచ్చి ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. సభలో వేదిక అనంతపురం కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, విరసం నాయకులు పాణి, వరలక్ష్మి, పద్మ, లక్ష్మీదేవి, రమణ, శ్రీనివాసులు రెడ్డి, హరిత పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న సీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

కామాంధుడికి దేహశుద్ధి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలం పోతులకుంట గ్రామంలో ఓ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన రామచంద్రారెడ్డి అనే వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. గ్రామస్థుల వివరాల మేరకు. . ఆదివారం ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న మహిళపై అతడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు అప్రమత్తమై రామచంద్రారెడ్డిని పట్టుకొని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అతడిపై గతంలో కూడా అనేక ఆరోపణలు ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

బీటీపీకి కృష్ణా జలాలు తెచ్చి మాట నిలబెట్టుకోవాలి

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తెస్తామని చెప్పిన కూటమి నాయకులు వెంటనే కార్యాచరణ ప్రారంభించి మాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండు చేశారు. ఆదివారం ఆయన సీపీఐ రైతు సంఘం బృందంతో కలసి బీటీ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత బీటీపీకి రూ.900 కోట్లకు పైగా నిధులతో కాలువలు తవ్వి, చెరువులకు నీరు అందించే పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కానీ, ప్రభుత్వం మారడంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి రూ150 కోట్లతోనే బీటీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తెస్తామని ఉత్త మాటలు చెప్పారన్నారు. ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తెచ్చే విషయంలో కూటమి ప్రభుత్వం దూకుడు పెంచాలన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం తాలూకా సీపీఐ ప్రధాన కార్యదర్శి నాగార్జున, ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, రాయదుర్గం ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తిప్పేస్వామి, మండల కార్యదర్శి దుర్గన్న, వాసికేరి రామాంజి, మల్లప్ప, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీటీ ప్రాజెక్టును సందర్శిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తదితరులు

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

అనంత నేరవార్తలు : అనంతపురం నగరంలో ఆదివారం సాయంత్రం ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుందుర్పి మండలం బెస్తరపల్లికి చెందిన లోకేశ్, కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా బూదబెట్ట గ్రామానికి చెందిన అఖిల (25)ను ఇచ్చి వివాహం జరిపించారు. ప్రస్తుతం వారు నగరంలోని ఆరో రోడ్డులో నివశిస్తున్నారు. అఖిల స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. కొంతకాలంగా అక్రమ సంబంధం పెట్టుకున్నావంటూ భర్త మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. మూడు రోజుల క్రితం కూడా ఆమెపై భర్త దాడి చేశాడు. కుమార్తెను తీసుకుని ఆజాద్‌నగర్‌లోని తల్లి వద్దకు వెళ్లింది. ఆదివారం లోకేశ్ అత్త ఇంటి వద్దకు వెళ్లి భార్యతో గొడవపడ్డాడు. అవమానంగా భావించిన అఖిల ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన తల్లి గంగమ్మ స్థానికుల సాయంతో కుమార్తెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం

గార్లదిన్నె, న్యూస్‌టుడే : గార్లదిన్నె మండలంలోని తలగాసిపల్లి సమీపంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి 30 మంది కూలీలు బయటపడ్డారు. కూలీలతో వెళ్తున్న వాహనాన్ని డ్రైవరు నరేష్ చాకచక్యంగా నడిపి పెద్ద ప్రమాదం నుంచి తప్పించారు. తెలంగాణ రాష్ట్రం కోత్తకోట మండలం పాపంపల్లి గ్రామానికి చెందిన దాదాపు 30 మంది వలస కూలీలు జీవనోపాధి కోసం బెంగళూరుకు వెళ్లారు. అక్కడ పనులు ముగిశాక స్వగ్రామాలకు ఐచర్ వాహనంలో బయలుదేరారు. గార్లదిన్నె సమీపంలోని తలగాసిపల్లి వద్దకు రాగానే ఏపీఎం ట్రావెల్స్‌కు చెందిన బస్సు బెంగళూరు నుంచి హైదరాబాదుకు వెళ్తూ రహదారిపై ఉన్న వేగనిరోధకాలను గమనించకుండా డ్రైవర్ బస్సును వేగంగా నడిపాడు. ఈఘటనతో ముందు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని ఢీకొనింది. అందులో ప్రయాణిస్తున్న కూలీలు గౌతమ్‌కుమార్, జ్యోతి, లక్ష్మి, శివమ్మ, అంజనేయులు, రాములు, మునెమ్మ, జయమ్మ,

సురక్షితంగా బయటపడిన కూలీలు

అనూష, సత్యమ్మ, వీరితోపాటు బస్సు క్లీనర్ ఉమందా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారు వారి స్వగ్రామాలకు వెళ్లినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు. క్షతగాత్రుల్లో బస్సు క్లీనర్ ఉమందా వలస కూలీలు గౌతమ్‌కుమార్, జ్యోతి తీవ్రంగా గాయపడ్డారు. జరిగిన ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో బస్సు డ్రైవరుపై కేసు నమోదు చేశారు.

కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు

✦ భార్య గొంతుకోసి పరారైన భర్త

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మూడుముళ్ల బంధంతో జీవితాంతం తోడుగా ఉండాల్సిన భర్తే కసాయి వాడుగా మారి భార్య గొంతుకోసి అతికిరాతకంగా చంపిన ఘటన మండలంలోని కలుగోడు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కలుగోడుకు చెందిన జ్యోతి(26)కి కొత్తపల్లి గ్రామానికి చెందిన వన్నూరుస్వామితో 8 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. రెండు నెలల కిందట భార్యాభర్తలిద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో జ్యోతి పుట్టింటికి వచ్చింది. కొన్ని రోజులుగా భర్త ఇంటికి రావాలని పలుమార్లు పిలచాడు. ఎన్ని సార్లు చెప్పినా మాట వినట్లేదంటూ ఆమెను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం రాత్రి అత్తారింటికి వెళ్లి కుటుంబసభ్యులతో కలసి భోజనం చేసి భార్యతో చనువుగా ఉన్నట్టు నటించాడు. అర్ధరాత్రి నిద్రపోతున్న భార్య నోటిలో గుడ్డలు కుక్కి కొత్తితో గొంతుకోసి పరారయ్యాడు. ఇంటి బయట పడుకున్న అత్తామామలు వర్షం పడటంతో ఇంట్లోకి వచ్చారు. రక్తపు మడుగులో ఉన్న కూతురును చూసి గట్టిగా కేకలు వేశారు. విషయాన్ని గుమ్మఘట్ట పోలీసులకు తెలియజేయగా ఎస్‌ఐ ఈశ్వరయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలానాపాలనా చూడాల్సిన తల్లి అనంతలోకాలకు వెళ్లగా.. తండ్రి జైలుపాలవడంతో చిన్నారులు అనాథలయ్యారు. కుమార్తె మృతి చెందటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.



జ్యోతి

పిడుగుపడి దంపతుల దుర్మరణం

✦ కుమారుడికి తీవ్ర గాయాలు

✦ రెండు పాడి ఆవులు మృతి

గోరంట్ల, న్యూస్‌టుడే: పాడి ఆవులను పోషించుకుని జీవించే ఆ కుటుంబంపై పిడుగుపడింది. రోజు మాదిరిగానే తెల్లవారుజామున పాలు పిండేందుకు వెళ్లిన దసరా నాయక్ (51), దేవీబాయి (46) దంపతులు పిడుగుపాటుకు గురై మృతిచెందారు. ఈ సంఘటన మండలంలోని దిగువగంగంపల్లి తండాలో ఆదివారం చోటు చేసుకుంది. మృతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెను అదే గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. కుమారుడు, కోడలుతో కలిసి వ్యవసాయం, పాడి ఆవులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో వారి పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. అడవి పందుల బెడద ఎక్కువగా ఉండడంతో శనివారం రాత్రి భార్యభర్తలు కాపాలా వెళ్లి అక్కడే పడుకున్నారు. రోజులాగానే ఆదివారం ఆవులకు పాలు పిండాలని తెల్లవారుజామున 5 గంటలకే బయలుదేరి పశువులషెడ్డు వద్దకు చేరుకున్నారు. తల్లిదండ్రులు రావడం ఆలస్యమవుతుందని కుమారుడు జగదీశ్ నాయక్ పాలు పిండేందుకు షెడ్డు వద్దకు వచ్చాడు. అంతలోనే వర్షం ప్రారంభమై పిడుగుపాటుకు గురయ్యారు. ఈ ఘటనలో రూ.1.50లక్షలు విలువ చేసే రెండు పాడిఆవులతో పాటు దంపతులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కుమారుడు తీవ్రంగా గాయపడడంతో అనంతపురం తీసుకెళ్లారు. ఈ ఘటనతో తండాతో పాటు సమీప గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మృతిచెందిన పాడి ఆవులు



దేవీబాయి



దసరా నాయక్

మృతుల కుటుంబాన్ని ఆదుకుంటాం : కలెక్టర్ చేతన్

పుట్టపర్తి : పిడుగుపాటుతో మృతి చెందిన దసరానాయక్, దేవీబాయి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్, పశుసంవర్ధశాఖ అధికారులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. మృతులకు ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వానికి నివేదిక పంపాం. గాయపడిన వ్యక్తికి చికిత్స నిమిత్తం రూ.50 వేలు అందిస్తాం. మృతి చెందిన ఒక్కో ఆవుకు రూ.37,500 చొప్పున అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

మృతుడి ఒంటిపై గాయాలు

✦ అనుమానాస్పద మృతిగా బంధువుల ఫిర్యాదు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : లోలూరుకు చెందిన ఖాసీం(49) మృతి పలు అనుమానాలకు దారి తీసింది. ఆదివారం గార్లదిన్నె పోలీసుస్టేషన్‌లో మృతుడి భార్య బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఖాసీం రోజు కూలీ పనులకు వెళ్లేవాడు. శనివారం

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

బాధితులను ఆదుకుంటాం: మంత్రి సవిత

గోరంట్ల, న్యూస్‌టుడే: పిడుగుపడి మృతిచెందిన దసరానాయక్, దేవీబాయి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా ఇప్పించి ఆదుకుంటామని వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలియజేశారు. తెదేపా నాయకుడు వెంకటేశ్వరరావు రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ సిబ్బందితో కలిసి తండాకు చేరుకుని ఘటన వివరాలు తెలుసుకున్నారు. మాజీ మంత్రి శంకరనారాయణ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సీఐ శేఖర్ అక్కడికి చేరుకుని విచారించారు. కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు నరసింహులు, భాజపా జిల్లాధ్యక్షుడు జీఎంశేఖర్‌లు నివాళులర్పించారు.

'తిరుమల పవిత్రత నాశనం చేశారు'

మడకశిర: గోమాతకు పూజలు చేస్తున్న భాజపా నాయకులు

మడకశిర, పెనుకొండ, న్యూస్‌టుడే: తిరుమల పర్యటనను మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎందుకు రద్దు చేసుకున్నారో బయట పెట్టాలని కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోమాతకు పూజలు నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరుడి పవిత్రతను నాశనం చేసిన జగన్‌కు తిరుమలలో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. తిరుమల లడ్డూ వివాదంలో దోషులను కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. పెనుకొండ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రధాన వీధులు గుండా వందలాది మంది ప్రదర్శన నిర్వహించారు.

అదుపుతప్పి బస్సు బోల్తా

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సోమందేపల్లి సమీపంలోని నలగొండ్రాయనపల్లి మలుపు వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధ రాత్రి ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి చిన్న పాటి గాయాలు మినహా ప్రమాదం జరగ లేదు. బెంగళూరు నుంచి కరీంనగర్‌కు 31 మంది ప్రయాణికులతో శనివారం రాత్రి బెంగళూరులో బయలు దేరిన ప్రైవేట్ బస్సు నలగొండ్రాయనపల్లి మలుపు వద్దకు ద్విచక్ర వాహన చోదకుడు అడ్డు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేకుండా చిన్న చిన్న గాయాలతో క్షేమంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేశ్‌బాబు, ఏఎస్సై మురళీమోహన్ ఘటనా స్థలానికి చేరుకుని సపర్యలు చేశారు. పలు బస్సుల్లో అందరిని గమ్యస్థానాలకు పంపారు. క్రేన్‌లతో బస్సును తొలగించి స్టేషన్‌కు తరలించారు.

రైతుపై దాడి

రొద్దం, న్యూస్‌టుడే : మండలంలోని శేషాపురంలో ఓ రైతు సాగు చేసిన దానిమ్మ తోటలో మొక్కలను పశువులు ధ్వంసం చేసి నష్టపరిచాయని అడిగినందుకు పశువుల యజమాని దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన యోగి అనే పశువుల యజమాని తనపై కట్టెతో కొట్టి దాడి చేసినట్లు తెలిపాడు. పోలీసులు గాయపడిన రైతును పరిశీలించి పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

పాలం కంచె ధ్వంసం

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని గుమ్మయ్యగారిపల్లికి చెందిన ఫకృద్దీన్ పొలానికి చుట్టూ వేసుకున్న ఫెన్సింగ్ (కంచె)ను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయమై బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 200 రాతిస్తంభాలు, ఇనుపతీగ తొలగించేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని బేవనహళ్లిలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ముద్ది రెడ్డిపల్లి హిందూ జ్ఞానవేదిక ద్వైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత విశిష్టతను తెలియజేస్తూ ఇంటింటికీ పుస్తకాలను పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు ఆదినారాయణ, మంగళ గౌరి, మునీంద్ర, రామమోహన్, ఓబులేసు, గౌతమి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జిల్లెడుగుంట సమీపంలో జూదమాడుతున్న ఏడుగురిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 26,100ల నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు, ఆరు చరవాణులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రామారావు తెలిపారు. మండలంలో ఎక్కడైనా మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం అందించాలని కోరారు.

పట్టణాలు - హిందూపురం, పెనుకొండ | అద్దె భవనాల్లో కొనసాగుతున్న బీసీ కళాశాల వసతి గృహాలు - 3 | అద్దె భవనంలో ఎస్సీ కళాశాల వసతి గృహం- 1 | బీసీ బాలికల వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య - 186 | ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య - 114 | ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న వసతిగృహం, విద్యార్థుల సంఖ్య - బీసీ బాలుర వసతి గృహం- 120

అద్దె భవనాల్లో వసతి గృహాలు

- సౌకర్యాల లేమితో విద్యార్థుల ఇక్కట్లు
- మంత్రి ఇలాకాలో దయనీయ పరిస్థితి

హిందూపురం అర్బన్, పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా వసతి గృహాలు అద్దెభవనాల్లో కొనసాగుతుండటంతో సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా బాలికల వసతి గృహాల్లో ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- హిందూపురంలోని బీసీ బాలుర వసతి గృహం ప్రభుత్వ భవనంలో కొనసాగుతున్నా, విద్యార్థులకు తగిన మరుగుదొడ్లు లేక బహిర్భూమికి ఆరుబయటకు వెళ్తున్నారు. నీటి సమస్య విద్యార్థులను వేధిస్తోంది.
- బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో కుళాయిల్లో వచ్చే నీరు సరిపడక తరచూ ట్యాంకర్లలో నీటిని కొనుగోలు చేస్తున్నారు. తీవ్ర ఇబ్బందుల నడుమ విద్యార్థుల చదువులు కొనసాగుతున్నాయి.

పెనుకొండలో అద్దెభవనంలో కొనసాగుతున్న బీసీ బాలికల వసతిగృహం

- హిందూపురంలోని ఎస్సీ బాలికల కళాశాల భవనం ఇరుకుగా ఉండటంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్టెలు, దుస్తులు అక్కడే ఉంచుకొని చదువుకుంటున్నారు. నిద్రించేందుకు సరిపడా స్థలం కూడా లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఉన్న జిల్లాలో వసతి గృహాలు ఈ విధంగా ఉండటం గమనార్హం. సత్వరమే మంత్రి చొరవ తీసుకొని శాశ్వత ప్రాతిపదిక వసతి గృహాలకు భవనాల సదుపాయం అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శాశ్వత భవనాల సౌకర్యం కల్పించాలి

బీసీ, ఎస్సీ వసతి గృహాలు అద్దెభవనాల్లో ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని యుద్ధప్రాతిపదికన భవనాల సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలి. ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. **- చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

నిధుల మంజూరుకు నివేదికలు

పెనుకొండలో బీసీ బాలుర వసతి గృహాన్ని త్వరలో ఐటీఐ భవనంలోకి మార్చి, బాలికల వసతి గృహాన్ని ప్రస్తుతం బాలురు ఉన్న వసతిగృహంలోకి మారుస్తున్నాం. హిందూపురంలో బీసీ బాలికల వసతిగృహానికి శాశ్వత ప్రాతిపదికన భవన సౌకర్యం అందుబాటులోకి తీసుకురావటానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే శాశ్వత భవనాల సౌకర్యం కల్పిస్తాం. **- గంగాధర్, సుబ్బరాయుడు, బీసీ సంక్షేమ సహాయ అధికారులు**

పీఎం అజయ్‌పథకం కింద ప్రతిపాదనలు

హిందూపురంలో పీఎం అజయ్ పథకం (కేంద్ర ప్రభుత్వం) కింద శాశ్వత భవనానికి అవసరమైన నిధుల మంజూరుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. దాదాపు 200 మంది విద్యార్థులకు సరిపడే భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. **- నరసింహారావు, ఎస్సీ బాలికల కళాశాల సహాయ సంక్షేమ అధికారి**

వర్షంతో రహదారులు జలమయం

రోడ్లపైకి చేరిన మురుగు

హిందూపురం అర్బన్: పట్టణంలో ఆదివారం తెల్ల వారు జామున ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. కాలువలు ఉన్నప్పటికీ పూర్తిగా మూసివేయటంతో మురుగు రోడ్లపైకి చేరింది. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బాలాజికూడలి, రైల్వేరోడ్, ధనలక్ష్మీరోడ్‌లో ఈ సమస్యతో ప్రజలు అవస్థలు పడ్డారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరాయి. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పలు ప్రాంతాల్లో పర్యటించి రహదారులపై నిల్వ ఉన్న నీరు కాలువల ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

బాలాజికూడలిలో నీటిలోనే రాకపోకలు

సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గొల్లపల్లి తాగునీటి పథకం పరిశీలన

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: గొల్లపల్లి నీటి సరఫరాలో అంతరాయం. ఇబ్బందుల్లో పురం ప్రజలు అంటూ పట్టణంలో వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరాపై 'ఈనాడు'లో ఆదివారం వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు నీటి సరఫరా విభాగం డీఈ బాలసుబ్రహ్మణ్యం, ఏఈ జనార్దన్‌లతో కలిసి గొల్లపల్లి ప్రాజెక్టు వద్ద ఉన్న ఇన్‌టెక్ వెల్, ఎస్‌కేడీ, వెంకటాపురం పంపు హౌస్‌లను ఆదివారం పరిశీలించారు. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానల్స్ కాలిపోయినట్లు ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. వెంటనే మరమ్మతులు చేయించాలని కమిషనర్ సూచించారు. ఇప్పటికే తాగునీటి పథకం మరమ్మతులకు రూ.1.5 కోట్లతో టెండర్లు పిలిచామని, కౌన్సిల్ ఆమోదం లేకపోవడంతో పనులు చేయించలేక పోతున్నామన్నారు. ఆలోపు తాత్కాలికంగా రూ.10 లక్షలతో అత్యవసర మరమ్మతులు చేయిస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

మోటార్లు పరిశీలిస్తున్న కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

రైతులకు పండ్ల మొక్కల పంపిణీ

అమరాపురం, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆదివారం ఉపాధి పథకం కింద పండ్ల మొక్కల పెంపకం చేవట్టే రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. సాంకేతిక సహాయకుడు హనుమంతరాయ 27 మంది రైతులకు 4,960 మొక్కలు పంపిణీ చేశారు. వర్షాధార భూముల్లో పండ్ల మొక్కల పెంపకం పథకం కింద రైతులకు పండ్ల మొక్కలతో పాటు ఉచితంగా గుంతలు తీయించి మూడేళ్ల పాటు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరాకు బిల్లులు అందిస్తామని ఏపీవో జగదీశ్ తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పండ్ల మొక్కలు నాటితే ఏపుగా పెరుగుతాయన్నారు.

పిడుగుపాటుకు తుమ్మచెట్టు ధ్వంసం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గౌడనహళ్లిలో ఆదివారం ఉదయం పిడుగుపాటుకు తుమ్మచెట్టు ధ్వంసమైంది. చుట్టుపక్కల ఎలాంటి ప్రాణాపాయం, ఆస్తినష్టం జరగకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి: డీఎస్పీ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదగా వ్యవహరించాలని డీఎస్పీ వై.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆదివారం సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్ఐ రమేశ్‌బాబుకు సూచించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఐ రాఘవన్, ఏఎస్ఐ మురళీమోహన్ ఉన్నారు.

- ఎలాంటి గొడవలు, ఘర్షణలకు వెళ్లకుండా ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సీఐ రాఘవన్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రమేశ్‌బాబుతో కలిసి ఆయన మండలంలోని పలువురు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వ్యవసాయ, కూలీ, ఇతర పనులు చేసుకొంటూ ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: కొండూరు బీసీ కాలనీలో మురుగు రోడ్డపై పారుతోంది. **- రామచంద్ర, స్థానికుడు**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **- సిద్ధార్థ, సర్పంచి, కొండూరు**

సమస్య: ఓబుళాపురంలో పంచాయతీ కుళాయిల నుంచి నీరు వృథాగా పారుతుంది. **- రత్నమ్మ, స్థానికురాలు**

సమాధానం: బిరడాలు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికడతాం. **- నరేంద్రకుమార్, సర్పంచి, బసలమానేవల్లి –న్యూస్‌టుడే, లేపాక్షి**

సమస్యల పరిష్కారం

మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు 'ఈనాడు'లో ప్రచురిత మయ్యే మేమున్నాం... మీకు తోడుగా దృష్టికి తీసుకురావడంతో సంబంధిత బాధ్యులు స్పందించి పరిష్కరించారు. కల్లూరులో పంచాయతీ కార్యదర్శి లక్ష్మప్ప ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు కాలువలు శుభ్రం చేశారు. బీసలమానేపల్లి పంచాయతీ ఓబుళాపురంలో సర్పంచి నరేంద్రకుమార్ వీధి దీపాలను ఏర్పాటు చేయించారు.

సర్వ సమస్యలకు ఏకైకమార్గం భగవద్గీత

మాట్లాడుతున్న రాజయోగిని బికే వీణ

హిందూపురం సాంస్కృతికం (ఎస్‌వీడీ రోడ్డు), న్యూస్‌టుడే: సర్వ సమస్యలకు భగవద్గీత ఏకైకమార్గమని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్‌వీడీ రోడ్డులోని వాసవీ ధర్మశాలలో ఆదివారం స్థానిక సత్యనారాయణపేటలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సర్వసమస్యలకు భగవద్గీత పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం హుబ్లీ ఆధ్యాత్మిక గురువు బీకే వీణ, బ్రహ్మకుమారీ రీజనల్ డైరెక్టర్ సుగంధదీదీ, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు కళావతమ్మ, ప్రగతి మహిళా మండలి ట్రెజరర్ లీల, జిల్లా భాజపా ప్రధాన కార్యదర్శి అమర్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జిల్లా స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ అండర్ 19 కరాటే పోటీలో ఆదివారం ఏంజీఎం ఉన్నత పాఠశాలలో కొనసాగాయి. బాల, బాలికలు పాల్గొని ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. త్వరలో కడప జిల్లా రాజంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంఈవో గంగప్ప, పీడీలు లోకేశ్‌నాథ్, సురేశ్, మెర్సీ, కరాటే కోచ్ ఫిరోజ్, షేక్షావలి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

- చండీఘర్ విశ్వవిద్యాలయం తలిసారిగా హిందూపురంలో లలిత కళలపై కళాకారులకు పరీక్ష నిర్వహించటం గర్వకారణమని ఎంఈవో గంగప్ప పేర్కొన్నారు. ఆదివారం ఏంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షలను ప్రారంభించారు. భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, చిత్రలేఖనం రంగాలకు చెందిన కళాకారులు పాల్గొనవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం, జ్యోతి, చతుర్వేది, సృజన స్రవంతి పాల్గొన్నారు.

రహదారిపై ఎండిన చెట్లతో జాగ్రత్త

మండలంలోని ముద్దిరెడ్డిపల్లి శ్రీశివబాలయోగి ఆశ్రమ కూడలి రోడ్డుపక్కన ఎండిన చెట్టు శనివారం రాత్రి కురిసిన వర్షానికి నేలకూలింది. ఇక్కడ మూడు చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే తొలగిస్తామని అధికారులు చెప్పినా ఫలితం లేదు. తెల్లవారు జామున చెట్టు కూలడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని గ్రామస్థులు తెలిపారు. మిగిలిన ఎండిన చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

మృత్యుపాశంగా.. విద్యుత్తు తీగ



మండలంలోని కే.బ్యాడిగెర ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చేతిక్కుందే ఎత్తులో విద్యుత్తు తీగ ఉండటంతో ప్రమాదంగా మారింది. ఈ దారిలో చిన్నపిల్లలు, విద్యార్థులు కాలినడకన వెళ్తుంటారు. పొరపాటున తీగను తాకితే పెనుప్రమాదమే. సమస్యను పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తీగను స్తంభానికి పైభాగంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై లైన్‌మెన్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణం సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, రొళ్ల

పశువులతో ప్రమాదాలు

పెనుకొండ పట్టణంలోని ప్రధాన రహదారిపై నిత్యం ఆవుల మందలు అడ్డంగా రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆవులను తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆదివారం వారపు సంత కావడంతో రోడ్డు పక్కన మేత కోసం గుంపులుగా వచ్చాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవుల యజమానులతో సమావేశం నిర్వహించి రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పెనుకొండ పట్టణం

తగ్గిన వంగ ధరలు.. ఆందోళనలో రైతులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: నెల రోజులుగా వంగ ధరలు భారీగా తగ్గాయి. మంచి లాభాలు చేతికందుతాయన్న ఉద్దేశంతో రైతులు బోరుబావుల కింద ఎకరా, ఆరెకరాలో వంగతోటలు పెంచుకున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 100 ఎకరాల్లో వంగ సాగులో ఉంది. 20 కిలోల వంగ బస్తా రూ.50లకే వ్యాపారులు అడుతుండడంతో రైతులు నష్టపోతున్నారు.

వారపు సంతలో ధర ఇలా..

మడకశిర మండలం కదిరేపల్లి వారపు సంతకు సుమారు 50 బస్తాల వంగ వచ్చింది. నాణ్యతను బట్టి 20 కిలోల బస్తా రూ.50 నుంచి రూ.100 లోపే ధర పలకడంతో పెట్టుబడులు, రవాణా ఖర్చులు కూడా చేతికందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కదిరేపల్లి వారపు సంతకు వచ్చిన వంగ బస్తాలు

5 బస్తాలు రూ.250కే విక్రయించా

బోరులో వచ్చే అరకొర నీటికి 30 సెంట్లలో వంగతోట సాగు చేశాను. సాగు ఖర్చు రూ. 4 వేలు అయింది. 15 రోజులుగా వంగను తొలగించి వారపు సంతల్లో విక్రయిస్తున్నాను. 5 బస్తాలు రూ.250లకే అమ్మేశా. ఇప్పటి వరకు 15 బస్తాల దిగుబడి రాగా కేవలం రూ.1000 మాత్రమే చేతికొచ్చింది. సాగు, వాహనానికి పెట్రోల్ ఖర్చులు కూడా గిట్టలేదు. **- కరియన్న, రైతు, కదిరేపల్లి**

మలుపులు.. ప్రమాద ఘంటికలు

అమరాపురం మండలం కాచికుంట - ఉడుగూరు మధ్య..

అమరాపురం, రొళ్ల, న్యూస్‌టుడే: అమరాపురం, రొళ్ల మండలాల్లోని పలు గ్రామాల మధ్య రహదారుల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుని వాహన చోదకులు ప్రాణాలు కోల్పోతున్నారు. గత ఐదేళ్లుగా రహదారుల మరమ్మతులతో పాటు ముళ్లపొదలు తొలగించక పోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

- కాచికుంట నుంచి హలుకూరు వెళ్లే రోడ్డులోని మలుపులో ఏడాది కిందట ఆదర్శ పాఠశాలలో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రక్షణగోడకు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు.
- అమరాపురం నుంచి హేమావతికి వెళ్లే రోడ్డులో నెల రోజుల కిందట మద్దనకుంట క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొని పరశురాంపురానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యారు.
- తమ్మడేపల్లి నుంచి వలస గ్రామం వైపు వెళ్తున్న వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థినికి కాలు విరిగి ఆసుపత్రి పాలైంది.
- కాకి నుంచి రెంటువళకు వెళ్లే రోడ్డులో మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో రత్నగిరికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. రొళ్ల నుండి అగ్రహారం వెళ్లే ప్రధాన రోడ్డులో మలుపు వద్ద ఇద్దరు మృతిచెందారు.



ప్రమాదాలు అరికడతాం

ప్రధాన రహదారుల్లో ముళ్లపొదలను తొలగించాలని పంచాయతీరాజ్ శాఖ, రోడ్లు, భవనాలశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మలుపుల వద్ద సూచిక బోర్డులు, వేగ నిరోధకాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. **- ఎంపీడీవో భాస్కర్**

చోరీకి విఫలయత్నం

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని అక్కమ్మగార్ల కాలనీ వెనుకభాగంలో నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు ఇంట్లో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. కమిషనర్, పోలీసుల వివరాల మేరకు.. రెండు రోజులు సెలవుపై ఇంటికి తాళం వేసుకుని ఊరెళ్లడం గమించిన దుండగులు చోరీకి యత్నించారు. తాళం బద్దలు కొట్టేటప్పుడు పోలీసుల వాహనం పెట్రోలింగ్‌కు వెళ్లగా దుండగులు పరారయ్యారు. ఇంట్లో వస్తువులు ఏమీ దొంగలించబడలేదని నిర్ధారించారు. దుండగుల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

వడ్డెర ఉద్యోగుల సభ జయప్రదం చేయండి

కదిరి, న్యూస్‌టుడే: వచ్చే నెల 6న నిర్వహించ తలపెట్టిన వడ్డెర ఉద్యోగుల సంఘ సభను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. కదిరిలోని రోడ్ల భవనాల అతిథి భవనంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కదిరిలోని ఎస్ఎంజేఎల్ కళాశాలలో వడ్డెర ఉద్యోగుల ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం ఉంటుందన్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. సమస్యలపై చర్చించటంతోపాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. సమావేశంలో కదిరి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు నారాయణ, జేవీ రమణ, మురళి, మునిస్వామి, గోపాల్, కృష్ణయ్య, రామాంజనేయులు, రమణ, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు తెదేపా సభ్యత్వం తప్పనిసరి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ కార్డు భవిష్యత్తులో రక్షణగా నిలుస్తుందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. రాష్ట్రంలో సభ్యత్వ నమోదులో పుట్టపర్తి నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం సాయిఆరామంలో పార్టీ సర్వసభ్య సమావేశం పల్లె అధ్యక్షతన జరిగింది. పార్టీ సభ్యత్వం ఉన్న వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసేందుకు, నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. రూ.100 చెల్లించి, సభ్యత్వ నమోదు పొందాలన్నారు. అన్ని రంగాల్లో పుట్టపర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని 195 చెరువులను కృష్ణాజలాలతో నింపడం, పుట్టపర్తి మున్సిపాలిటీకి రూ.100.20 కోట్లతో చేపట్టిన సురక్షిత తాగునీటి పథకాన్ని వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు.

ఉద్యోగం పేరిట మోసం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: బెంగళూరులోని ఫార్మా కంపెనీలో ఇంటర్వ్యూ లేకుండానే ఉద్యోగం ఇప్పిస్తానంటూ 8మంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించిన ఘటనపై కదిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక శివాలయం వీధికి చెందిన శివకుమార్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు. బీటెక్‌లో ఇతని సహ విద్యార్థి అయిన కదిరికి చెందిన మురళీధర్ ఫార్మా కంపెనీలో నెలకు రూ.35వేల జీతంతో ఉద్యోగం ఇప్పిస్తానన్నారు. అందుకు రూ.2.80 లక్షలు అవుతుందని నమ్మబలికారు. శివకుమార్ తనతోపాటు మరో ఏడుగురి నుంచి డబ్బులు వసూలు చేసి మురళీధర్‌కు రూ.18లక్షలు ఫోన్‌పే చేశారు. అతడు ఎనిమిది మంది ఈమెయిల్స్‌కు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు పంపారు. వీటి ఆధారంగా బెంగళూరుకు వెళ్లిన నిరుద్యోగులు అలాంటి కంపెనీ లేదని తెలుసుకుని అవాక్కయ్యారు. మోసపోయినట్లు గ్రహించిన యువకులు డబ్బులు వెనక్కి ఇవ్వాలని మురళీధర్‌ను కోరారు. డబ్బులు ఇవ్వకపోగా వారిని నిందితుడు బెదిరించాడు. ఆదివారం బాధితులు కదిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆటోడ్రైవర్లపై కేసు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోనేరు కూడలిలో ఆదివారం బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లికి చెందిన సోమశేఖర్, కదిరి మండలం చెర్లోపల్లికి చెందిన హరీశ్ వేగంగా ఆటోలు నడిపారు. దాంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

షెడ్డు కూల్చివేతపై ఫిర్యాదు

ధర్మవరం: గుట్టకిందపల్లిలో ఆదివారం తమకు చెందిన రేకుల షెడ్డును పునాదితో సహా పొక్లెయిన్‌తో కూల్చేశారని అరుణ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోపూరు రాజు అతడి కుటుంబ సభ్యులు షెడ్డును కూల్చడమే కాక తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పుట్టపర్తి చిత్రావతి నదిలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

చిత్రావతిని తోడేస్తున్నారు

ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలింపు

రాజకీయ ఒత్తిళ్లతో పోలీసుల వెనుకంజ

న్యూస్‌టుడే: ధర్మవరం, పుట్టపర్తి

ధర్మవరం, పుట్టపర్తి ప్రాంతాల్లో చిత్రావతి నది నుంచి ఇసుక అక్రమంగా తరలుతోంది. అక్రమార్కులు ట్రాక్టర్లలో నింపి భవన నిర్మాణదారులకు విక్రయిస్తున్నారు. ధర్మవరం మండలం పోతులనాగేపల్లి, మల్లాకాల్వ పరిధిలో చిత్రావతి నది నుంచి ట్రాక్టర్లలో ఇసుక ధర్మవరం పట్టణానికి తరలిస్తున్నారు. ఒక ట్రాక్టరు లోడును రూ.2500 నుంచి రూ.3000 వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పుట్టపర్తి సమీపంలో చిత్రావతి నది నుంచి ప్రతిరోజూ ట్రాక్టర్లతో ఇసుక తీసుకెళుతున్నారు. గృహనిర్మాణదారుల వద్దకు ట్రాక్టర్ల యజమానులు వెళ్లి వారికి ఇసుక ఎంత అవసరమో తెలుసుకొని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఆమేరకు పట్టపగలే ఇసుకను తోలుతున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

చిత్రావతి నదిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశిస్తాం. వీఆర్వోలతో నిఘా పెడతాం. రీచ్‌లలో ఇసుక అందుబాటులో ఉంది. గృహ నిర్మాణాలు చేసే వారు అక్కడి నుంచి ఇసుక తెచ్చుకోవాలి.

- వెంకటశివరామిరెడ్డి, భాగ్యరేఖ (ధర్మవరం, పుట్టపర్తి ఆర్డీవోలు)

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

నిల్వ ఉన్న నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

సమస్య: మండలంలోని ముక్తాపురం సచివాలయానికి ఆనుకొని ఉన్న రహదారి వెంబడి వర్షపు నీరు నిల్వ ఉంటోంది. **- నారాయణస్వామి, స్థానికుడు.**

సమాధానం: వర్షపు నీరు నిల్వ ఉండకుండ చర్యలు చేపడుతాం. **- వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి, ముక్తాపురం.**

సమస్య: మండలంలోని మామిళ్లపల్లిలో సీసీ రోడ్లకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన కాల్వల్లో మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. **- రాముడు, స్థానికుడు.**

సమాధానం: మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతాం.

- మోహన్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే: కనగానపల్లి

ఎమ్మెల్యే కందికుంటకు చెక్కులు అందిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం

విద్యార్థులను సమాజ హితానికి తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే

కదిరి, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజం పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించేలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. స్థానిక దత్త ఫంక్షన్ హాలులో ఆదివారం కదిరి డివిజన్ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్(కేడీపీఎస్ఏ) ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి కేడీపీఎస్ఏ తరపున రూ.1.25 లక్షలు, సాధన పాఠశాల యాజమాన్యం రూ.75వేల చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు. సాధన పాఠశాల ఇచ్చిన మొత్తంలో రూ.6వేలు సేకరించి ఇచ్చిన విద్యార్థి హరికొస్తభను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, సింగారెడ్డి, కృష్ణమూర్తి, జయచంద్రనాయుడు, వేణుగోపాల్, రవిచంద్రారెడ్డి, రామచంద్ర, రామచంద్రను సన్మానించారు.

వర్షం కురవాలని వలసగంగమ్మకు బోనాలు

తలుపుల, న్యూస్‌టుడే: వర్షం కురిసి పాడిపంటలతో గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని కోరుతూ గుండువారిపల్లి గ్రామస్థులు ఆదివారం వలసగంగమ్మకు బోనాలు సమర్పించారు. ప్రత్యేక శాంతి పూజలు చేశారు. గ్రామం నుంచి ప్రజలందరూ బోనం గంపలతో ప్రదర్శనగా వెళ్లారు. గంగమ్మకు జలాభిషేకం చేశారు. పసుపు కుంకుమతో పూజించి, బోనం సమర్పించారు. వంటావార్పు చేసుకొని రోజంతా అక్కడే గడిపారు. సాయంత్రం తిరిగి గ్రామానికి చేరుకున్నారు.

నేడు వినతుల స్వీకరణ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్, పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (జీపీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న తెలిపారు. డివిజన్, మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ముదిగుబ్బలో వర్షం

ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలంలో ఆదివారం ఉదయం సుమారు గంటసేపు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో కాలనీల్లో, ఇళ్లముందు వర్షపునీరు నిలిచింది. పల్లపు ప్రాంతంలో నీరు నిలవడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడ్డారు.

నవరాత్రి ఉత్సవాలకు విరాళం

ధర్మవరం పట్టణం: పట్టణంలోని శ్రీలక్ష్మిచెన్నకేశవపురంలో జరిగే దేవీ నవరాత్రి ఉత్సవాలకు స్థానిక తెదేపా నాయకుడు చీమల నాగరాజు రూ.10,000 విరాళం ప్రకటించారు. ఆదివారం ఈ నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలోని దత్త ఫంక్షన్ హాలులో ఆదివారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. డివిజన్ గౌరవాధ్యక్షులుగా శివశంకర్, కిరణ్‌కుమార్, అధ్యక్షుడిగా సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అలీంబాషా, ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్, కోశాధికారిగా కుమార్, సీఆర్ఓగా శంకర్‌రెడ్డి, గౌరవ సలహాదారుగా మస్తాన్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

చెన్నేకొత్తపల్లి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని రౌడీషీటర్లను ఆదివారం స్థానిక ఠాణాకు పిలిపించి తనదైన శైలిలో హెచ్చరికలు జారీ చేశారు.

'మన్‌కీబాత్' మంచి సందేశం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్‌కీబాత్ కార్యక్రమంతో ప్రజలకు మంచి సందేశం అందిస్తున్నారని భాజపా రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమల ప్రకాశ్‌నాయుడు తెలిపారు. ఆదివారం మన్‌కీబాత్ 114వ ఎపిసోడ్‌ను ప్రజలకు చూపించి అవగాహన కల్పించారు.

మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి సత్యాగ్రహ దీక్ష

ధర్మవరంపట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర విభజన జరిగి సుమారు పది సంవత్సరాలు కావస్తున్నా మున్సిపాలిటీ ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పాఠశాలల్లో తగిన సబ్జెక్టులకు ఉపాధ్యాయుల్లేక బోధన సక్రమంగా సాగడం లేదన్నారు. గత ప్రభుత్వం 3,4,5 తరగతులు విలీనంచేసి బోధించడానికి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను నియమించలేదని తెలిపారు. మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు బదిలీలు జరగకపోవడంతో పదోన్నతులు ఆగిపోయాయని అన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ శాఖల ఉపాధ్యాయులకు ఇచ్చినట్లే మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు కూడా వేతనాలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి అక్టోబరు 2 నుంచి అన్ని మున్సిపాలిటీల్లో సత్యాగ్రహ దీక్ష చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సంఘం నాయకులు సుధాకర్, బూతన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

ప్రజల ఆవసరాలు తీర్చడానికే ప్రాధాన్యం

దివ్యాంగుడికి వీల్ చైర్ సైకిల్‌ను అందజేస్తున్న తెదేపా నాయకులు

కనగానపల్లి: కనగానపల్లి మండలంలోని కేఎన్ పాళ్యంలో దివ్యాంగుడైన మంద ముత్యాలుకు ఎమ్మెల్యే పరిటాల సునీత వీల్ చైర్ సైకిల్‌ను అందజేశారు. మంద ముత్యాలు గతంలో చేసిన విన్నపానికి ఎమ్మెల్యే స్పందించారు. ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత సైకిల్ పంపారని నాయకులు తెలిపారు. నాయకులు బ్రహ్మానంద రెడ్డి, లక్ష్మిరెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

గొట్టూరు అనాథాశ్రమంలో అన్నదానం

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని గొట్టూరు అనాథాశ్రమంలో ఆదివారం చంద్రబాబునగర్‌కు చెందిన యోగా శిక్షకుడు ఈశ్వరయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదానం, వస్త్రదానం చేశారు.

ఆలయ గోపురంపై పిడుగు

తనకల్లు, న్యూస్‌టుడే: తనకల్లులోని సాయిబాబా ఆలయంపై పిడుగు పడటంతో గోపురం స్వల్పంగా దెబ్బతింది. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు పిడుగు పడి కొంత భాగం పెచ్చులూడింది. పెద్దప్రమాదం తప్పడంతో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ గోపి దెబ్బతిన్న గోపురాన్ని పరిశీలించారు.

జూదరుల అరెస్టు

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని ఈతోడు గ్రామ సమీపంలో కోడి పందెం ఆడుతున్న ఐదుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. వారి నుంచి రూ.30,350 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు చెప్పారు.

దంపతులకు గాయాలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు బీసీ కాలనీలో రాజు దంపతులు వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో ఇద్దరూ గాయపడ్డారు. రాజు పెయింటు పనులతో జీవనం సాగించేవారు. గాయపడిన దంపతులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

అభయమిస్తూ.. ఆసరాగా నిలుస్తూ..

ఆపదవేళ చేతిలో చిల్లిగవ్వ లేక దీనస్థితిలో ఉన్న వారికి దాతలు అండగా నిలుస్తున్నారు. మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు. కొందరు బృందాలుగా ఏర్పడి డబ్బులు పోగు చేసి కష్టాల్లో ఉన్న అనారోగ్య బాధితులు, నిరుపేద విద్యార్థులకు అందిస్తున్నారు. వెన్నుతట్టి వారి మోముల్లో చిరునవ్వులు నింపుతున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న దాతల గురించి స్ఫూర్తిదాయక కథనం.

- న్యూస్‌టుడే: పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, కొత్తచెరువు,

ఆపద్బాంధవులు

పుట్టపర్తి పట్టణంలోని గోవిందపేట సేవా సమితి బృందం 2021 నుంచి కష్టాల్లో ఉన్న వారికి తోడుగా నిలుస్తున్నారు. 2022లో క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆదినారాయణకు వైద్యసేవల కోసం రూ.40వేలు అందించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కిష్టప్పకు రూ.10వేలు ఇచ్చారు. ఓ విద్యార్థి ఉన్నత చదువులకు రూ.10వేలు అందించి ప్రోత్సహించారు. అనాథ చిన్నారుల ఆరోగ్య పరీక్షలకు రూ.15వేలు ఇచ్చారు. విజయవాడ వరద బాధితులకు రూ.50 వేలు చెక్కును కలెక్టర్ చేతన్‌కు అందజేశారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న యువకుడికి నగదు అందిస్తున్న గోవిందపేట సేవా సమితి సభ్యులు

ఆపదవేళ స్నేహితులు

కదిరిలోని లోటస్ జిమ్ నిర్వాహకుడు రమేశ్, మిత్రబృందం యుగంధర్, రాంబాబు, గణేష్, గాంధీ, చైతన్యలు ఆపదలో ఉన్న స్నేహితుల కుటుంబాలకు చేయూతనిస్తున్నారు. ఏడాది కిందట చిగురుమాను తండాలో మిత్రుడు తిరుమలనాయక్ తండ్రి బాలేనాయక్ మృతి చెందడంతో స్పందించి రూ.10వేలు సాయం అందించారు. ఆరు నెలల కిందట తనకల్లులో తమతో కలిసి పదోతరగతి చదువుకున్న హరికృష్ణ మృతి చెందటంతో ఆ కుటుంబానికి అండగా నిలిచారు. తలా కొంత మొత్తాన్ని పోగుచేసి రూ.68వేలను బ్యాంకులో జమ చేశారు. కష్టాల్లో ఉన్నవారికి తాము బాసటగా నిలుస్తున్నట్లు చెబుతున్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న మిత్ర బృందం

మిత్రుల తోడ్పాటు

కొత్తచెరువులో చిరు వ్యాపారంతో కుటుంబాన్ని పోషిస్తున్న సాయిప్రవీణ్ హఠాన్మరణం చెందారు. అప్పటి వరకు అతనిపై ఆధారపడిన వృద్ధ తల్లిదండ్రులు, సోదరి పోషణ కష్టంగా మారింది. 1998-94లో పదోతరగతి చదివిన అతని మిత్రులు విషయం తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. రూ.లక్ష నగదు సాయం అందించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు.

వైద్యానికి ఆర్థిక సాయం

ధర్మవరం పట్టణంలోని ఆసుపత్రుల్లో వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు తారక్ ట్రస్టు అధ్యక్షుడు అంకె రామాంజనేయులు తోడ్పాటునందిస్తున్నారు. రంగుల అద్దకంలో వచ్చే ఆదాయంలో 30 శాతం, మిత్రుల సహకారంతో రోగులకు అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు రూ.లక్షలు అందించారు. సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయడమే లక్ష్యమని ఆయన అన్నారు.

రోగికి నగదు అందిస్తున్న అంకె రామాంజనేయులు

నూతన ఎస్ఐకి సన్మానం

బుక్కపట్నం, న్యూస్‌టుడే: బుక్కపట్నం ఎస్ఐగా కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఆదివారం ఆయన్ను తెదేపా నాయకులు, గ్రామస్థులు కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు సహకరించాలన్నారు. పిల్లలను విద్యావంతులను చేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గంగాధర్, నరేశ్, లావణ్య, కుమార్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న తెదేపా నాయకులు, గ్రామస్థులు

సీఐ మృతికి నివాళి

నల్లమాడ, న్యూస్‌టుడే: కడప పట్టణంలో ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రమావత్ అర్జున్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఆయన మృతదేహాన్ని మండల పరిధిలోని అరవవాండ్లపల్లి తండాకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఏఎస్పీ శ్రీనివాసులు, నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి గ్రామానికి చేరుకొని సీఐ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం కడప ఏఆర్ పోలీసులు గాల్లోకి తుపాకులు పేల్చి గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

నివాళి అర్పిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసులు

ముసురు పోటు.. దోమ కాటు

ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీలో మురుగుతో నిండిన కాలువ

పట్టణాల్లోని డ్రైనేజీలు మురుగుతో నిండి ఉంటున్నాయి. వర్షం వస్తే అవి పొంగి ప్రవహిస్తున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం లేదు. అందులో నుంచి భరించలేని దుర్వాసన వస్తోంది. దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రమైతే ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఫాగింగ్ చేస్తున్నా ఫలితం కానరావడం లేదు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ధర్మవరం పట్టణం, కదిరి, పుట్టపర్తి, న్యూస్‌టుడే: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి పట్టణాల్లోని శాంతినగర్, లోనికోట, లక్ష్మీచెన్నకేశవపురం, కేతిరెడ్డి కాలనీ, ప్రియాంకనగర్, నల్లగుట్ట, వాసవినగర్, మారుతినగర్, వాణీవీధి, ఏనుములపల్లి ఎస్సీ కాలనీ, బ్రాహ్మణపల్లి బీసీ కాలనీ, బీడుపల్లి ఎస్సీ కాలనీ, తదితర కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. గత రెండు నెలలుల్లో దోమ కాటుతో వందల మంది జ్వరాలతో మంచం పట్టారు. రెండు, మూడు రోజులపాటు జ్వరాలు తగ్గకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకుంటే చాలా మందికి మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు సోకినట్లు అందులో తేలింది. రోగులు అధికం కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్ల కొరత ఏర్పడింది. ధర్మవరంలో 45 మంది, కదిరిలో 60, పుట్టపర్తిలో 25 మంది జ్వరాల బారిన పడ్డారు. నిబంధనల మేరకు పట్టణాలలో యాంటిలార్వా ఆపరేషన్, ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ వేసే పనులు సక్రమంగా చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కదిరి, పుట్టపర్తి కమిషనర్లు కిరణ్‌కుమార్, ప్రహ్లాద్ వివరణ కోరగా పారిశుద్ధ్య పనులు చేయిస్తామన్నారు. దోమల నివారణకు మురుగు కుంటలలో ఆయిల్‌బాల్స్ వేసి, ఫాగింగ్ చేపడతాం. కాలువల్లో పేరుకున్న చెత్త, చెదారాన్ని తొలగించేస్తాం. డ్రైనేజీ వ్యవస్థ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కదిరి: నల్లగుట్టలో..

ఇద్దరికి తీవ్ర గాయాలు

కనగానపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ముక్తాపురం కూడలిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు పేర్కొన్నారు కనగానపల్లి గ్రామానికి చెందిన సురేశ్ చౌదరి తన తల్లి సరోజతో కలిసి పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో అనంతపురం వెళుతున్నారు. ముక్తాపురం కూడలి దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. వైద్యం నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

నిధుల స్వాహాపై చర్యలేవీ?

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మేజరు పంచాయతీలో నిధుల స్వాహా, అక్రమాలపై రెండేళ్లుగా విచారణ కొనసాగుతూనే ఉంది. గత ఐదారేళ్లలో పంచాయతీ నిధులను యథేచ్ఛగా స్వాహా చేసిన కార్యదర్శి, జూనియర్ అసిస్టెంటు, బిల్ కలెక్టర్‌లను వరుసగా సస్పెండ్ చేశారు. అక్రమాలపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అప్పటి జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అప్పటి పెనుకొండ డీఎల్పీవో బాలాజీని విచారణ అధికారిగా నియమించారు. ఆయన పంచాయతీ దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు.

అర్ధాంతరంగా అధికారుల బదిలీలు

కొన్నాళ్లకే విచారణాధికారి అర్ధాంతరంగా బదిలీ అయ్యారు. అక్రమార్కులకు అండగా ఉన్న పర్యవేక్షణ అధికారులు సైతం బదిలీపై వెళ్లారు. గతంలో పెనుకొండ డీఎల్పీవోగా సుదీర్ఘకాలం పనిచేసి నిధుల స్వాహాలో వాటాలతో మునిగి తేలిన అధికారికి జిల్లా పంచాయతీ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడంతో అక్రమార్కులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటి నుంచి విచారణ ముందుకు సాగలేదు. స.హ.చట్టం దరఖాస్తులకు రికార్డులు డీఎల్పీవో కార్యాలయంలో ఉన్నాయని చెప్పడం పరిపాటిగా మారింది. పంచాయతీలో నకిలీ బిల్లులు, పన్నుల వసూళ్లు, భవన నిర్మాణ అనుమతుల్లో అడ్డగోలుగా స్వాహాపర్వానికి పాల్పడి రెండున్నరేళ్లుగా అతీగతీ లేని విచారణ మూడేళ్ల కిందట బదిలీపై వెళ్లిన మండల స్థాయి అధికారి మళ్లీ ఇక్కడికి బదిలీ చేయించుకోవడం గమనార్హం. ఇటీవల రూ.6 లక్షల వేలం డీడీలను స్వాహా చేసినా కార్యదర్శిపై కనీస చర్యలు చేపట్టలేదు. సదరు కార్యదర్శిని దీర్ఘకాలిక సెలవుపై పంపారు. అయితే ప్రస్తుతం జరిగిన బదిలీల్లో కార్యదర్శిని అనంతపురం జిల్లాకు బదిలీపై పంపడం అక్రమార్కుల బంధాన్ని బహిర్గతం చేస్తోంది. చివరకు అక్రమాలకు ప్రధాన కారకుడైన జిల్లా అధికారి కూడా బదిలీ కావడంతో విచారణ కథ ముగిసినట్లేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు కొత్తచెరువు మేజరు పంచాయతీలో జరిగిన అక్రమాలను నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుతున్నారు.